ఘనంగా షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం హెచ్ఎంటీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం నాచారం హెచ్ఎంటీనగర్ పురవీధుల్లో స్వామివారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ ఊరేగింపులో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. బీజేఆర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేసిన ఆయన మాట్లాడుతూ.. భోజనం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా నాణ్యత పెరగాలని, ప్రభుత్వపరంగా సహకారం కావాలంటే అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రంలోని పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మజ, మంజుల, నాయకులు బాబు, కిషోర్, మోసిన్, సలీం, సయ్యద్, అక్బర్ పాల్గొన్నారు.

మూడో రోజు గ్రూపు -1 పరీక్ష ప్రశాంతం

మల్కాజిగిరి: గ్రూప్– 1 మెయిన్స్ మల్కాజిగిరిలోని రెండు సెంటర్లలో మూడో రోజు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1394 మంది అభ్యర్థులకు 929 మంది హాజరు కాగా.. సెంటర్ 1లో 129 మంది, సెంటర్ 2లో 336 మంది గైర్హాజరయ్యారు.

వ్యక్తి ఆత్మహత్య

కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

మల్కాజిగిరి: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సిల్వర్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్‌లో వేణుగోపాల్‌రెడ్డి (52) ప్రైవేట్ ఉద్యోగి. కాగా 2021లో అమెరికా నుంచి వచ్చే వరకు తల్లిదండ్రులు శారద, హనుమంత్‌రెడ్డిలను ఆయన సోదరి అరుణ చూసుకునేది. వేణుగోపాల్‌రెడ్డి వచ్చిన తర్వాత తాను ఒంటరిగా ఉంటానని గొడవపడటంతో తల్లితండ్రులు సొంతవూరు వనపర్తి జిల్లా యనిగల్లకు వెళ్లిపోయారు. ఈనెల 21న వేణుగోపాల్‌రెడ్డి కనిపించాడని ఆ తర్వాత ఫ్లాట్‌కు తాళం వేసి ఉందని అరుణకు ఫోన్ ద్వారా స్థానికులు సమాచారం అందించారు. 22న ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చి తాళం పగులగొట్టి చూడగా..ఉరేసుకుని కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని ఎస్సై తెలిపారు. వివాహం కాకపోవడం, మానసికస్థితి బాగాలేకపోవడంతేనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తల్లితండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

కుషాయిగూడ: ఊరెళ్లి వచ్చే లోగా ఇల్లు గుల్ల చేసిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ సాయినగర్‌కాలనీ సుదర్శన్ ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్స్‌లో దంతవైద్యుడు డా. అజయ్ నివాసం ఉంటున్నారు. ఈనెల 17న సొంత పనిపై చెన్నై వెళ్లాడు. అనంతరం ఈనెల 21న తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. సాయినగర్‌లోని తన ఇంటికి వెళ్లి చూసేసరికి దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 16 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఈఓల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

శామీర్‌పేట్: 167 మంది ఏఈఓల (వ్యవసాయ విస్తరణ అధికారి)సస్పెన్షన్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందిందని, వెంటనే సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర అడ్ హాక్ చైర్మన్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సుమారు 2వేల మంది ఏఈఓలు సమావేశమయ్యారు. ప్రభుత్వంతో తుది నిర్ణయం కోసం చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వివరించారు.

వీధి కుక్కల పట్టివేత

మల్లాపూర్: నాచారం ఇందిరానగర్‌లో గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో స్థానికులు కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె కుక్కలను పట్టుకెళ్లాలని వెంటర్నరీ అధికారి యాదగిరికి సమాచారం ఇవ్వగా.. 6 కుక్కలను వెంటాడి పట్టుకెళ్లారు.



పేదల జీవితాలతో ఆటలొద్దు!

• ఎంపీ ఈటల రాజేందర్

రామంతాపూర్: 40 ఏళ్ల క్రితం గండిపేట నుంచి గౌరారం వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ పరివాహక ప్రాంతంలో పేదలు పైసా పైసా కూడబెట్టుకుని ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని ప్రభుత్వం సుందరీకరణ పేరుతో కూల్చివేస్తామనడం సరికాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం రాష్ట్ర బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు రామంతాపూర్ మూసీ బఫర్ జోన్ నివాసితుల ఇళ్లను ఆయన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్. ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. బీజేపీ పార్టీ ఖచ్చితంగా ఈ ప్రాంత ప్రజల ఇళ్లు కూల్చకుండా అండగా ఉంటుందన్నారు. ఒకవేళ ప్రభుత్వం కూల్చేందుకు వస్తే రేవంత్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడినట్లేనన్నారు.

కేసీఆర్‌పై వ్యతిరేకతతోనే..

ప్రజలు కేసీఆర్‌ను ఒడగొట్టాలని కసితోనే కాంగ్రెస్‌కు పట్టం కడితే పట్టం కట్టిన పాపానికి ఈ ప్రభుత్వం ప్రజలను నానా విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పేద ప్రజల ఇళ్లకు ఎలాంటి హాని చేయకుండా మూసీ ప్రక్షాళన చేపడతామంటే తమకేమి అభ్యంతరం లేదని, పేద ప్రజల ఇళ్ల జోలికి వస్తే ఖబర్దార్ అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


రామంతాపూర్ మూసీ బఫర్‌జోన్‌లో పర్యటిస్తున్న ఎంపీ ఈటల, రాకేష్‌రెడ్డి తదితరులు

సాంకేతికతతో మురికి నీటిని శుభ్రంగా..

ఆధునిక టెక్నాలజీతో మూసీ నదిలోని మురికి నీళ్లను శుభ్రం చేయవచ్చని దానికి కోట్లు ఖర్చుపెట్టి ఐమాక్స్ థియేటర్లు జలహవిహార్ లాంటి భవనాలను నిర్మించి పేదల ఉసురు తీస్తామనడాన్ని బీజేపీ ఒప్పుకోదన్నారు. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ బఫర్ జోన్‌లో నివసిస్తున్న పేద ప్రజలకు బీజేపీ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలుపుతుందని వారి కోసం తమ పార్టీ నేతలు 24 గంటలు అందుబాటులో ఉండి ఆదుకుంటామన్నారు. రామంతాపూర్ మూసి బఫర్‌జోన్‌లోని ఇళ్లను ఒక అంగుళం కూడా కూల్చకుండా బీజేపీ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన, ఉప్పల్ బీజేపీ ఇన్‌చార్జి దేవసాని బాలచందర్, గౌరిగే కృష్ణ, హనుమంతరావు, శ్రీనివాస్‌చారి, సోమశేఖర్‌గౌడ్, ఎల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కు గోఖలేనగర్‌లోని బృందావన్ పార్కులో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగ ఏరోబిక్స్ ఇతర అనేక రకాలైన వ్యాయామాలతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఆరోగ్యంగా ఉంటేనే మనస్సుకు ఉల్లాసం, ఉత్సాహం కలుగుతుందన్నారు. ఓపెన్ జిమ్‌లో ప్రజలు అన్ని రకాల వ్యాయామాలు చేసేందుకు పలు పరికరాలు ఉన్నాయని, వాటిని ప్రజలు ఉపయోగించుకుని లబ్ది పొందాలని ఆయన సూచించారు. బీజేపీ రాష్ట్రనేత గద్దం సాయికిరణ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారు వెంకట్‌రావు, ప్రగతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి సీహెచ్ మురళీధర్, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సలహాదారులు పాల్గొన్నారు.


ప్రగతినగర్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

5న ఆటో యూనియన్ ధర్నా

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని అమలు సాధనకై చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ధర్నా తలపెట్టారని నిర్ణయించామన్నారు. గత పదేళ్లలో అమలు కానీ హామీలు తాము అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని చెప్పి విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.12 వేలు ఇవ్వడంతో పాటు ఆటోమోటార్ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయండి

ఉప్పల్: ఈనెల 29న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించే ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని దండోర సీనియర్‌నేత తోకట నరేష్, వంగ ప్రణయ్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయ అవరణలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా మాదిగ ఉపకులాలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలు జరుగుతున్నాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈనెల 29న నిర్వహించే ఈ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు కేశవ్, అశోక్, మస్క రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం


స్వచ్ఛ వాహనాన్ని అందజేస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు బుధవారం నూతన వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నిత్యం పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రపరుస్తూ.. మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. నగర ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం కోసం చెత్త, చెదారాన్ని రోడ్లు, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య అధికారులకు సహకరించాలని కోరారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, కొత్త దుర్గమ్మ, సింగిరెడ్డి పద్మారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, చీరాల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

కుషాయిగూడ: కాలనీ సమస్యలపై చర్లపల్లి డివిజన్, బీఎన్‌రెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అంతర్గత, సీసీరోడ్ల నిర్మాణం, వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీ అధ్యక్షుడు దామోదర్‌చారి, సుభాష్, రాజు, దామోదర్ పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎంబీబీఎస్ విద్యార్థికి ఎమ్మెల్యే బాసట


విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థికి ఉప్పల్ బండారి లక్ష్మారెడ్డి బాసటగా నిలిచారు. చర్లపల్లి డివిజన్, సాయివెంకట్ ఎన్‌క్లేవ్‌లో నివసించే బాణాల నవీన్‌కుమార్ కుమారుడు బాణాల నిఖిల్ చార సనత్‌నగర్ ఈఎస్ఐ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. పేద కుటుంబానికి చెందిన నిఖిల్ తల్లిదండ్రులు ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన ట్రస్టు ద్వారా ఆర్థికసాయం అందజేసేందుకు ముందుకొచ్చారు. బుధవారం నిఖిల్ ఫీజుకు సంబంధించిన చెక్కును ఆయన అందజేశారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే చేయూతనందిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించిన పేద విద్యార్థులకు తనవంతు ఆర్థికసాయం అందజేశానని భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు నేమూరి మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కనకరాజు, సార అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

కీసర : కీసర మండలంలోని చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్ష నిర్వహణను బుధవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనితోపాటు పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ పర్యటనలో కాలేజ్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఎగ్జామ్స్ కంట్రోలర్ దేవయ్య, కీసర ఎంఆర్‌ఓ, అశోక్‌కుమార్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు.

రోడ్డుపైనే ఎదురుచూపులు!

బస్‌షెల్టర్ లేక విద్యార్థుల అవస్థలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ గంటల తరబడి రోడ్లపై నిల్చొని తమ గమ్యస్థానానికి చేరే బస్సు వచ్చేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సుషెల్టర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సాయినగర్ చౌరస్తాలో రోడ్డుపై నిలుచున్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని రూరల్, అర్బన్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం మరమ్మతుల కారణంగా వివిధ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు. రావల్‌కోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చెరువు కట్ట ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు, గణపతి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పూడూర్ సబ్‌స్టేషన్, పూడూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మూసీలో కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహం



ఉప్పల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మూసీలో కొట్టుకొచ్చిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ కేటీఆర్‌నగర్ కాలనీ మూసీలో దాదాపుగా 52 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు వినతి

మల్లాపూర్: నాచారంలోని పలు పార్కుల్లో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ కోరారు. దీనిపై బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్నేహపురి కాలనీ పార్క్, వీఎస్టీ కాలనీ పార్క్, రాఘవేంద్రనగర్‌లోని రైతుబజార్ వెనుకభాగంలోని ఖాళీస్థలంలో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు మరమ్మతులకు గురయ్యాయని, కొన్నిచోట్ల విరిగిపోయి పనికిరాకుండా పోయాయన్నారు. వీటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.


ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం


ప్రమాణ స్వీకారంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని అతి పురాతన మల్లికార్జునస్వామి దేవాలయ నూతన ఆలయ కమిటీ ప్రమాణస్వీకారానికి బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ఆలయ కమిటీ చైర్మన్‌గా నామ్ రాజిరెడ్డి సభ్యులుగా మేడిపల్లి విశబూల్‌రెడ్డి, లింగం, సతీష్‌గౌడ్, బాలయ్య, శోభ, జంగయ్యతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి దూపదీప నైవేద్యాలకు అనేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు కూడా సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు కంది ఆగిరెడ్డి, తోఫిక్, బాబుయాదవ్, మురళిగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, రఫీక్, అరుణ్, శ్రవణ్‌రెడ్డి, సందీప్, సంధ్యారాణి తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేడిపల్లి: ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి 11వ మెగా పోటీల్లో బచ్‌పన్ అకడమిక్ హైట్స్ మేడిపల్లి విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా మేడిపల్లి బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్లో అవార్డుల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పూలమాలలతో విద్యార్థులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించి అభినందించారు. రీజనల్ కో– ఆర్డినేటర్ సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ అలేఖ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

యధావిధిగా బస్సులు నిలిపేలా తగిన చర్యలు


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న అంజయ్య

కుషాయిగూడ: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ మీదుగా వెళ్లే 3 ఎన్‌హెచ్ ఆర్టీసీ బస్సు హాల్టింగ్ విషయంపై బుధవారం కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షులు పోలేపాక అంజయ్య కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యధావిధిగా బస్సులు తిరిగి నిలిపేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమీప కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో కృష్ణానగర్‌రోడ్ నంబర్ 7లో నిలిపే ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం ఆపడం లేదని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్ ఎస్సీసెల్ అధ్యక్షుడు జెమిని తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ భాగ్యనగర్ కాలనీ, దేవేందర్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ కుతాడి సాయి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను బుధవారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జవహర్‌నగర్‌కు మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.100 కోట్లతో జవహర్‌నగర్ నలువైపులా 100 ఫీట్ల రోడ్ల పనులు ప్రారంభమవుతున్నాయన్నారు. కార్పొరేషన్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పేదలు నివసించే జవహర్‌నగర్‌కు అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ నగేష్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు సతీష్‌గౌడ్, భాస్కర్, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.